# దీపం

ఆరుబయట మంచం వేసుకుని, ఆకాశం చూస్తూ పడుకున్నాడు రాజు. సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చి, స్నానం చేసి అన్నం తినేటప్పటికి రాత్రి అయింది. స్నానం చేసినా చల్లదనం లేదు గాలిలో. చూపుమేర దాకా మేడలూ, దీపాలూ తప్ప విశాలంగా ఆకాశం, తళుకు తళుకుమంటూ నక్షత్రాలూ కనిపించవు. నూతిలో కప్ప నయం. మేడలు కోసేసిన ఆకాశంలో కనిపించే నక్షత్రాల్ని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. చల్లని పైరుగాలి, నల్లని ఆకాశంలో ఎగిరే పక్షులు, పచ్చని చేలు, గలగలపారే పంట కాలవలతో తను పుట్టి పెరిగిన పాలెం ఈ మధ్య తరచు గుర్తు వస్తూంది రాజుకి. గుర్తు వచ్చిన కొద్దీ ఈ పట్నం బ్రతుకుమీద విరక్తి ఎక్కువవుతూంది. 'పాడు పట్నం, వెధవ సంపాదన, దరిద్రపు బ్రతుకూ... దీన్ని వదిలేసెయ్యాలి అనుకున్నాడు.

రాజు భార్య సీత తనుకూడా అన్నం తిని నిద్రవచ్చి ఏడుస్తున్న చంటివాడితో వచ్చి మంచం ఆనుకుని ఉన్న వరండాలో చతికిల పడింది. భార్య వచ్చి కూచోగానే ఇటువైపు ఒత్తిగిలి,

''ఇదిగో సీతాయ్, నేను చెబుతున్నది బాగా విను. ఈ కూలీ నేనింక చెయ్యను. ఈ ఊళ్లో నేనింక ఉండను. మూడేళ్ళకే మొహం మొత్తేసింది! ఏం పట్నం! నాకీ బతుకు సరిపడదు. పాలెంలో స్కూలుకు మంచి మేష్టారుగా, ఊరివాళ్ళకు మంచి స్నేహితుడుగా, అయిన వాళ్ళందరికీ నమ్మకస్తుడిగా మంచిని మమతనీ పెంచుకునే బతుకు — అది బతుకు కాని ఇది బతుకేనా! ఇరుగు పొరుగు

ఆప్యాయత లేదు. మంచికి మన్నన లేదు. రాత్రి పగలు, ఎండా వాన మరిచి నెలంతా రెక్కలు కొట్టుకుంటే— నా సంసారం నేను పోషించుకోలేను! ఇంక బతికేదెప్పుడు? పద పాలెం పోదాం.'' అన్నాడు.

ఒళ్లో పిల్లాడిని జోకొడుతున్న సీత చిన్న నవ్వు తొణికించింది.

''ఇది నువ్వు ఏడాదినించి పాడుతున్న పాటే కదు మావా'' అంది.

''ఇంక ఎవరు చెప్పినా వినేది లేదు. సామాను సర్దు. రేపే ప్రయాణం.'' అన్నాడు తొందర పెడుతూ.

''రేపే ప్రయాణం అంటే డబ్బు కావద్దా?'' అంది సీత.

''మీ అమ్మని అడగటం లేదులే. అడగాలే కానీ ఈ రాజా చేతిలో వంద రూపాయలు టప్పుమని రాలతాయి.''

''ఓస్, నీకే ఉన్నారు స్నేహితులు, నేను వస్తా సరే గానీ అమ్మ మాటో'' అంది సీత.

సీత మాటలు వింటూ రాజా సీతని చూస్తున్నాడు. ఇరవై ఏళ్ళ వయసులో మాతృత్వం, స్త్రీత్వం రంగరించుకుంటూంది సీత. నలుపైనా నునుపు దేరిన దేహచ్ఛాయతో సౌష్టవంగా ఉండే రూపం. కాంతితో మిలమిలలాడే కళ్ళు. చేమంతిలా కలకలలాడే మొహం. నవ్వితే మనసుకి గాలం వేసినట్లు ఉంటుంది. మనసు రంజిల్లగా, ఒక చేతిమీద ఆని సగం లేచి,

''ఓయ్ సీతాయ్, నీకు ముడెయ్యబట్టి గానీ, లేకపోతే ఎప్పుడో ఈ పట్నంనించి పారిపోయి ఉండేవాణ్ణి. మీ అమ్మనీ రమ్మను మనతో. తిండి పెట్టలేనా? ఈ రెక్కల్లో సత్తువ ఉండి, ఈ బుర్రలో / బుద్ధి ఉన్నంత కాలం దానికేం భయం లేదు. ఏమనుకున్నావో పిల్లా!'' అన్నాడు చేతి కండలు పొంగించి కన్ను గీటుతూ.

సీతకి ఒళ్ళు ఝల్లుమంది. గుండె గుబగుబలాడింది ఉత్సాహం కళ్ళలోకి తరుముకు వచ్చింది. మావకేసి ఓరగా చూసి,

''కానీ మా అమ్మ సామాన్యురాలు కాదు మావా. హోటలూ, సంపాదనా మాని మనతో వస్తదంటావా?'' అంది.

''అమ్మ అమ్మ అంటూ కూచోడానికి నువ్వు మూడేళ్ళ పిల్లవి కాదే సీతా. మీ అమ్మ వచ్చినా మానినా నేను మాత్రం ఆగేది లేదు'' అన్నాడు రాజా. తలగడమీద తల వాల్చుతూ. ఎక్కడనించో చల్ల గాలి విసిరింది. సీతకి మనసులో దిగులు వేసింది.

* * * *

రాజు రత్తమ్మకి వరసకు తమ్ముడవుతాడు. రత్తమ్మ మొగుడు నరసింహం. చిన్నతనంలోనే, పాలెం వదిలి మెడ్రాసు వెళ్ళాడు. రకరకాల పనులు చేసి ఆఖరికి ఒక కార్ఖానాలో కూలీలపైన మేస్త్రీగా స్థిరపడి భార్యని తీసుకువచ్చాడు. తరవాత సీత పుట్టింది. ఆ పిల్ల పుట్టిన నాలుగు నెలలకే నరసింహులు జబ్బు చేసి చచ్చిపోయాడు. రత్తమ్మ బెంబేలు పడి పాలెం పోలేదు. నరసింహులికి రావలసిన ప్రావిడెంటు ఫండు రాబట్టుకుంది. తెలిసినవాళ్ళ సాయంతో డబ్బు బాంకులో వేసి, మూడు వందలు ఖర్చు చేసి చిన్న హోటలు తెరిచింది. సాయానికి కుర్రాణ్ణి పెట్టుకుంది. అప్పటికే రత్తమ్మ పట్నవాసం బతుక్కి అలవాటు పడిపోయింది. ఇస్త్రీ చీరలు కట్టటం, సినిమాలకి వెళ్ళటం, నాజూకుగా మాట్లాడటం నేర్చింది. ఒళ్ళు తెలియని కోపం వస్తే తప్ప పాలెం భాషలో యాసగా మాట్లాడదు. హోటలు బాగానే గడిచేది. పిల్లని లోటు లేకుండా పెంచింది. పదేళ్ళు వచ్చేవరకు స్కూలుకు పంపించింది. తరవాత బయటికి పంపకుండా తన దగ్గిర ఉంచుకుని హోటలు నడపటంలో తర్ఫీదు ఇచ్చింది. పదహారేళ్ళు వచ్చేసరికి సీత తల్లికి చేదోడు వాదోడుగా ఉంది. రత్తమ్మకి అందంగా ఎదిగిన సీతని చూస్తే దిగులు వేసింది, దానికి తగినవాణ్ణే కట్టబెట్టాలని.

మొదటినించీ రాజు రత్తమ్మకి మనసులో మెదులుతూనే ఉన్నాడు. రాజు చిన్నప్పటినించి చురుకైన వాడు. చదువుకున్నాడు. టీచరు ట్రైయినింగయి పాలెం ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా ఉన్నాడు. చెప్పుకోతగ్గ రూపమూ, మనిషికి కావలసిన మంచితనమూ ఉన్నాయి. ఆలస్యం చెయ్యకుండా, ''వెంటనే మద్రాసు'' రమ్మని ఉత్తరం రాయించింది రత్తమ్మ. రాజు పట్నానికి వచ్చాడు హుషారుగా.

''నాకు తోడుగా ఉండి హోటలు నడపాలి. నా కూతుర్నిచ్చి నీకు పెళ్ళి చేస్తాను. ఇదంతా మీదే నా అనంతరం'' అంది రత్తమ్మ.

రాజు సమ్మతంగా తల ఊపాడు. రాగానే ఊరు ఉత్సాహం కలిగించింది. మనసు సీతని మెచ్చింది. వెంటనే సీతని రాజుకి ఇచ్చి పెళ్ళి జరిపించింది రత్తమ్మ. ఒక ఏడాది గడిచింది. సీతకి కుతురు పుట్టింది. రాజుకు హోటలు పని వ్యవహారం నచ్చలేదు.

''మొగాడికి పాతికవనీ, పరకవనీ సంపాదన ఉండాలే. మీ అమ్మ చేతి డబ్బులకి నేను ఆశ పడలేను'' అన్నాడు.

''అమ్మ మనకేం లోటు చేసింది! కావలిసిందంతా ఖర్చు పెడుతూంది'' అంది సీత.

''అదే నాకు పడదు. సంపాదన మీ అమ్మది. ఖర్చు నాదీనా?'' అన్నాడు.

''ఇదంతా మీదే కదా'' అంది రత్తమ్మ.

''కారేజీలు తీసుకుపోతే వందపైనే వస్తుందిట. వెంకటేసుతో బాటు నేనూ వస్తానని చెప్పాను'' అన్నాడు రాజా.

ఆ పని ప్రారంభించి ఏడాది దాటలేదు.

''రోజంతా తిరగటమే ఇంటింటికీ. ఒక రోజూ తీరికా, విశ్రాంతి లేవు. ఇంక ఈ పని నేను చేసేది లేదు'' అన్నాడు రాజా.

ఆ తరవాత రత్తమ్మ అనేక ప్రయత్నాలు చేసింది. నరసింహులు పని చేసిన కార్ఖానాలో రాజాకి కూలి పని దొరికింది. పేరుకి కూలీ కానీ బి.ఏ. చదివిన గుమాస్తా కంటే ఎక్కువ డబ్బు వస్తుంది కార్ఖానాలో.

ఈ సారి సీత కొడుకుని కంది. కార్ఖానా పనిలో చేరి ఏడాది అయింది. రాజాకి ఆ పనిమీద, పట్నం బ్రతుకుమీద కూడా రోత పుట్టింది. పుట్టి పెరిగిన ఊరిమీద మనసు పోయింది. పాలెం పోవాలన్న కోర్కె రోజులు గడిచిన కొద్దీ ముదిరి పోయింది.

రాజా నిర్ణయం సీత ద్వారా వింది రత్తమ్మ.

''వాడిని నమ్ముకుని పిల్లనిచ్చాను. ఇప్పుడు ఎక్కడికి వెడతాడే! ఎట్లాగ వెడతాడు? వెధవ పల్లెటూళ్లో ఏముందని ఆ పాలెం పోతానంటాడు. అక్కడ కంటే ఇక్కడ ఎక్కువ సంపాదిస్తున్నాడు. అసలు సంపాదించ అవసరం లేకుండా ఈ హోటలు ఉంది. ఇక్కడ ఉన్న బ్రతుకు తెరువు అక్కడ ఉందా? మూడేళ్ళయింది. మరిచి పోయాడు కాబోలు! అక్కడి మట్టి కొంపలూ, కీచులాటలూ నేను ఎరగనా? పుట్టింటి గొప్పలు మేనమామ దగ్గిరా! నే నెట్లాగ వస్తాననుకున్నాడు! ఈ హోటలు మానుకుని వాడు పెట్టే తిండి తిని పడుండటం నా వల్ల కాదు! మీ నాన్నతో ఏ శుభముహూర్తంలో పట్నంలో కాలు పెట్టానో కానీ నా బతుకు హాయిగా గడిచి పోతూంది ఒకరి మీద ఆధారం లేకుండా. ఇవేళ ఇది విడిచి వెళ్ళటం కలలో మాట'' అంది రత్తమ్మ.

తల్లి మాటలకు సీత కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''మరి నాతో వస్తావో, మీ అమ్మతో ఉంటావో తేల్చేసుకో అన్నాడమ్మా మావ'' అంది సీత వణికే గొంతుతో.

కూతురి భుజంమీద చెయ్యి వేసి,

''ఏడుస్తావెందుకే ఎర్రి పిల్లా! ఈ పట్నానికి అలవాటు పడ్డవాడు ఆ పాలెంలో ఉండగలడా! సంపాదనకి అలవాటుపడ్డవాడికి చేతిలో డబ్బులాడక పోతే క్షణం తోస్తుందా! నువ్వు ఇక్కడ ఉండిపో... నెల తిరిగేసరికి నీ దగ్గిరికి వచ్చి వాలతాడు. నీ కోసమైనా రాడా?'' అంది రత్తమ్మ సవాల్ చేస్తున్నట్లు.

ఆ మరునాడు రాజు పెట్టె సర్దుకుని రైలు ఎక్కేశాడు. రాజు ఎక్కిన రిక్షా కదిలి వెళ్ళిపోయే దాకా చూస్తూ నిలబడింది సీత. తరువాత గదిలోకి వెళ్ళి పిల్లలిద్దరినీ గట్టిగా కౌగలించుకుని కన్నీళ్లు కార్చేసింది. నెల గడిచింది. రెండు నెలలు కూడా గడిచాయి. రత్తమ్మ అన్నట్లు రాజు రాలేదు. పదిహేను రోజులకొక సారి ఒక కార్డు మాత్రం వస్తూంది రాజు దగ్గిరనుంచి, అతడి క్షేమ సమాచారాలతో. ఒక రోజు వచ్చిన ఉత్తరం చూసి కన్నీరు మున్నీరుగా అయింది సీతకి. సీత ఏడవటం చూసి మండిపడింది రత్తమ్మ.

''ఎదవ మొగమూ!'' అని ఈసడించింది.

''ఎందుకే ఏడుస్తావ్! నువ్వింత ఎర్రి మొగానివి కనకనే వాడు ఆడిస్తున్నాడు. ఈ పాటికే బెంబేలు పడిపోతావెందుకే. ఇది నిన్ను రప్పించుకోవాలని వాడి వన్నాగం. నాటకం! అంతే. వాడికి సుస్తీ లేదు, సింగినాదమూ లేదు'' అని నచ్చజెప్పింది.

''ఆడదంటే, గుండెల్లో సముద్రం పొంగుతుంటే పెదాలమీద నవ్వుల పువ్వులు రాల్చాల, కన్నుల్లో నిప్పులు కురిపించాల!'' అని ప్రబోధించింది. సీత ఏడుపు దిగమింగింది.

''నువ్వన్నట్లు అది నాటకమైతే ఫర్వాలేదు. కానీ నిజమైతే? నేను బ్రతికి ఎందుకు? ఎందుకులే అమ్మా. నన్ను మావ దగ్గరికి పోనీ'' అంది.

రత్తమ్మకి కోపం వచ్చేసింది.

''నువ్వూ వెడితే ఈ హోటలు నా ఒక్కదానితో నడుస్తుందా! నేనూ పెద్దదాన్నవటం లేదూ?... ఇదివరకు లాగ ఓపిక ఎక్కడ ఏడిసింది! తమ్ముడు కదా అని పిలిచి పిల్లనిచ్చాను. పరాయివాడు వెళ్ళిపోతే తల్లి కన్న బిడ్డవు వాడి వెనక నువ్వూ పోతావా? ఆడపిల్ల వనిపించావే. మగపిల్లవాడు లేకపోయినా అన్నీ నువ్వే అనుకుని పెంచాను. అర్ధరూపాయికి గేదె పాలు దొరుకుతూంటే, పరణాలకి ఆవు పాలు కొని పోశాను. కొత్త గుడ్డ తొడగకుండా పుట్టిన రోజూ, పండగ పొద్దూ గడవనీయలేదు. కోరిక తీరా తినకపోయినా, కట్టకపోయినా, నెలకి ఐదు చొప్పున వెనకేసి నీకు మామిడి పిందెల నెక్లేసూ, రెండు జతల గాజులూ చేయించాను. ఐదో క్లాసుదాకా చదువు చెప్పించాను. నీ తండ్రి సంపాదించి పోయినది కానీ ఖర్చు చేయకుండా మిగిల్చి చదువుకున్నవాణ్ణే తెచ్చి నీకు పెళ్ళి చేశాను. నా బతుకంతా నీకు ధారపోశాను. నీ పిల్లలు నా పిల్లలే అనుకున్నాను. రాజు నా కొడుకే అనుకున్నాను. నువ్వూ వెళ్ళిపోతా నంటావా? నీకు సిగ్గు లేదు. నీకు కృతజ్ఞత లేదూ?'' అంది.

తల్లి ముఖంలో క్రోధం, దుఃఖం తాండవమాడుతున్నాయి.

సీత తల వంచుకుని కన్నీళ్ళు తుడుచుకుంది. మెడలో గొలుసూ చేతుల కున్న బంగారు గాజులూ తీసి అక్కడ పెట్టింది.

''నువ్వు అన్నీ చేశావమ్మా. ఏం చేసినా చెయ్యకపోయినా నువ్వు అమ్మవి. నీ ఋణం తీర్చుకోలేను నేను. అందుకే మావ మాట కాదని నీ దగ్గిర ఉండిపోయాను. కానీ ఇప్పుడు వెళ్ళక తప్పదు. ఇవ్వన్నీ నా కవసరం లేదు. నీ దగ్గిర ఉండనీ... పసుపు కుంకుమ ఉంటే నా కన్నీ ఉన్నట్టే'' అంది.

''ఏం వగలు పోతున్నావే కృతఘ్నురాలా!'' అంటూనే ఏడ్చింది రత్తమ్మ. ఆ రోజంతా తిండి తినలేదు సీత.

''పో నీకు నేను అవసరం లేదు. మొగుడే కావాలి'' అంటూ రత్తమ్మ సీతకి గాజులు తొడిగి గొలుసు మెళ్లో పెట్టింది.

''ఎక్కడ చూసినా మోసగాళ్ళే, ఒక్కతెవూ పోగలవా'' అడ్డు ప్రశ్న వేసింది.

''చిన్నప్పుడు చూశాను కదూ పాలెం. నన్నూ, నా పిల్లల మొహం చూసి ఎవరూ మోసం చెయ్యరమ్మా'' అంది సీత.

రత్తమ్మ హోటలు ఖర్చుల కుంచిన డబ్బు లోనించి కొంత తీసి సీతకూ, పిల్లలకి కొత్త బట్టలు కొంది. టిక్కెట్టు కొని రైలెక్కించింది. సీత చేతిలో పది రూపాయలు పెట్టి, రైలు కదులుతూంటే కిటికీలో తలపెట్టి ''అమ్మని మరిచిపో. ఇంక నీకు తల్లి లేదనుకో'' అంది.

అంత దాకా ఆగిన ఏడుపు రైలు కదలగానే వరద లెత్తింది సీతలో. మనసు విలవిలలాడింది.

''అమ్మా, నేను కృతఘ్నురాలినే, పాపిష్ఠిదాన్నే. నీకు దూరంగా వెళ్ళిపోతున్నా'' అనుకుని తనలో తను ఆక్రోశించింది.

పాలెం వెళ్ళడానికి దగ్గిరగా ఐదు వందల మైళ్ళు రైలుమీద ప్రయాణం చెయ్యాలి. రైలు దిగి మూడు మైళ్ళు బండిమీద పోవాలి. రైలు చకచకా ముందుకు పోతుంటే భూమి గిరగిరా తిరిగి వెనక్కి పోతూంది.

'అమ్మకి ఎంత దూరం చేసేస్తూందీ రైలు!' అనుకుంది సీత.

సీతకి మనసు మనసులో లేదు. సీతకి చిన్నతనంలో ఒక సారి జబ్బు చేసింది. కొండకి తీసుకువస్తానని రత్తమ్మ మొక్కుకుంది. సీతకి జబ్బు తగ్గాక మొక్కు తీర్చి అక్కడినించి పాలెం వెళ్ళి సీతకి ఇల్లూ ఊరూ చూపించి పట్నానికి తిరిగి వచ్చింది.

సీతకి ఆ ఊరు గానీ, ఆ ఊరి మనుషులు కానీ గుర్తు లేరు. వెళ్ళాలన్న నిశ్చయం, మావ దగ్గిర కెడుతున్నా నన్న తృప్తి సీతని రైల్లో కూచోబెడుతున్నాయి. పిల్లల్ని ఊరుకోబెట్టడానికి ఏవో కొని పెడుతూనే ఉంది తినడానికి. తనకి ఏదీ మింగుడు పడలేదు. రెండో రోజు రైలు దిగే సరికి పొద్దు మళ్ళుతూంది. రేగిన తల, నిద్ర లేక బడలిక చెందిన శరీరం, ఇల్లు చేరుకోవా లన్న అదుర్దా. పెట్టెనూ పిల్లల్నీ తీసుకుని స్టేషను బయటికి నడిచింది సీత.

అక్కడ రెండు బళ్ళూ, సైకిలు రిక్షాలూ ఉన్నాయి.

ఒక బండివాడు ముందుకు వచ్చి

''ఏడకెల్లాలి?'' అని అడిగాడు.

''పాలెం..''

''ఎవరింటికి?''

''నరసింహులు కూతుర్ని నేను. రాజు వీళ్ళ తండ్రి'' అంది సీత పిల్లాడి నెత్తిమీద చేయి వేసి.

''నరసింహులు కూతురివా. మద్రాసునించి వచ్చావా? రాజన్న భార్యరా రాములూ'' అంటూ ముందుకు వచ్చా డొక రిక్షావాడు సీతను గుర్తు పట్టేసి.

''ఔ'' నని తలూపింది సీత.

''బండెక్కు చెల్లెమ్మా. నేను తీసుకుపోతాను'' అన్నాడు బండివాడు.

పెట్టె అందించి, పిల్లలతో బండి ఎక్కింది సీత. దోవ పొడుగునా రాజును గురించి, పాలెం కబుర్లూ చెబుతూనే ఉన్నాడు రాములు. మనసు స్తిమితపరచు కుంటూ ఊ కొడుతూంది సీత. ఇంటిదగ్గిర బండి దిగి పిల్లల్ని తీసుకుని లోపలికి నడిచింది. రాములు పెట్టె తెచ్చి లోపలపెట్టి సీత ఇచ్చిన రూపాయి తీసుకుని వెళ్ళాడు. సందడి విని బయటికి వచ్చిన రాజుని చూసి గతుక్కుమంది సీత. తెల్ల గుడ్డలు కట్టుకుని, తమలపాకుల రసంతో ఎర్రబడిన పెదవులతో అందంగా, ఠీవిగా ఉన్నాడు వాడు. వాడి ముఖంలో నవ్వు కూడా ఉంది.

దుఃఖం ఎదురవలే దని సంతోషమో....

మోసం జరిగిందని మనసు దెబ్బ తిందో..

మోసం జరగినా దుఃఖం మాత్రం లేదని ఓదార్పో!

నోట మాట రాలేదు సీతకి.

''ఓయ్... ఒక్కత్తెవూ వచ్చేశావూ. ఇదేమి రూపమే సీతాయ్'' అని

ఆప్యాయంగా దగ్గిరకి తీసుకున్నాడు.

''నీ కోసం పిచ్చిదాన్నయి వచ్చాను. నువ్వు కులాసాగానే ఉన్నావు మావా'' అంది తృప్తి, నిష్ఠూరం మేళవించి.

''ఎప్పటికైనా రావలసినదానివే. నాకేం, నిక్షేపం లాగ ఉన్నాను.''

''నిజంగా కృతఘ్నురాలినే నీకోసం వెర్రెత్తిపోయాను. నన్ను నమ్ముకున్న అమ్మని కాదన్నాను. ఎందుకు మోసం చేశావు? నిజమే, నీమీద మనసుతో అమ్మమీద ప్రేమ చంపుకున్నాను... కృతఘ్నురాలినే, కృతఘ్నురాలినే'' అని తనను నిందించుకుంది సీత.

''నీ కోసం తపించి పోయాను. నువ్వు లేకపోతే ఎట్లాగ జరుగుతుందే? అన్నాడు రాజా.

''అయితే అక్కడికి రాకపోయావా?'' నిలదీసింది సీత.

''ఛీ. అదీ ఒక బతుకేనా? నువ్వు ఈ దెబ్బకి రాకపోతే సుబ్బయ్య కూతురు సావిత్రిని పెళ్ళాడేద్దా మనుకున్నా'' అన్నాడు పకాలున నవ్వి రాజా. మావ చేతుల్లో సేద దీరుతున్న సీత గుండె ఎగసిపడింది.

* * * *

రెండు నెలలూ గడవలే దింకా, స్నేహితురాలు తులసి ఉత్తరం రాసింది.

''మీ అమ్మ చిక్కి సగమయింది. తిండి తినదు. నిద్రపోదు. కనిపించిన వాళ్ళందరికీ నీ పిల్లల సంగతులే చెబుతుంది. పండగకి గుడ్డలు కుట్టించింది. చూసుకుంటూ ఉంటుంది. మతి పోయిందేమో అనిపిస్తాంది. హోటలు సాగటంలేదు...''

''మా అమ్మకి మతి పోయింది.'' అని ఏడిచింది సీత.

''నేనే మతి పోగొట్టాను'' అని కుమిలిపోయింది.

''అమ్మని మరిచిపో. ఇంక నీకు అమ్మ లేదు'' అని తల్లి అన్న మాటలు గుర్తు వచ్చి సీతను నిలవనీయలేదు.

''అమ్మో. అమ్మ కావాలి. నేను అమ్మని మరిచిపోలేదు'' అనుకుందీ. రాజాకి ఉత్తరం చూపించి పెట్టెలో బట్టలు సర్దుకుంది. ఉగ్రుడయ్యాడు రాజా.

''వచ్చి రెండు నెలలు కాలేదు, రైలు చార్జీలు ఎవడు తిన్నట్లు? నేను చేసివట్లే మీ అమ్మ వేషం వేసింది'' అన్నాడు.

''కాదు కాదు. అందరి బుద్ధి ఒక లాగ ఉండదు. మా అమ్మకి నిజంగానే మతి

లేదు. నామీద, పిల్లలమీద బెంగ పెట్టుకుంది. నీకు అమ్మ లేదని చెప్పింది. నేను వెళ్ళకపోతే అది బతకదు. నీ మీద భ్రమతో నేనే సిగ్గు విడిచి పరిగెత్తుకు వచ్చా. నీ లాగ మా అమ్మ మోసం చెయ్యదు. అది తల్లి ప్రాణం. నీది, నీది... నేను గాకపోతే సావిత్రి...'' అంది.

''దాని ఊసెత్తకు. అంత అమ్మ కావల్సిందానివి పెళ్లెందుకు చేసుకున్నావే!'' అన్నాడు రాజా.

దుఃఖంలోనూ కోపంతో భగ్గుమంటూ

''అంతమాట అనటానికి నోరెల్లాగ వచ్చింది? వెళ్ళకుండా ఉండటానికి ఎత్తింది మనిషి జన్మకాదూ. కని పెంచినదాన్ని మరిచిపోనా? అమ్మకి నేను గాక ఎవరున్నారు! ఇంక రావద్దంటే మా అమ్మ దగ్గరే పడుంటాను కానీ కృతఘ్నత నా వల్ల కాదు'' అంది సీత.

రాజా సీతను రైలెక్కించాడు, రైలు అయిదువందల మైళ్ళూ వెనక్కి నడిచి సీతని మెద్రాసు జేర్చింది. దుఃఖంతో తల్లి ఒళ్లో వెళ్ళి పడింది సీత. దైన్యం మూర్తీభవించినట్లు ఉంది రత్తమ్మ.

''ఎందుకు వచ్చావు! ఏముందని మీ అమ్మదగ్గిరకి వచ్చావు'' అంది రత్తమ్మ. సీత అదేం వినిపించుకోలేదు. చిక్కిపోయి చీదరగా ఉన్న తల్లిని చూసి దుఃఖమాగలేదు. ''అయ్యో ఎట్లాగయిపోయావే! నాకీ పెళ్ళి ఎందుకు చేశావమ్మా'' అని ఏడ్చింది. సీత పడుతున్న బాధ అప్పు డర్థమయింది కాబోలు!

''నా తల్లీ, నిన్ను ఎంత బాధ పెట్టాను. వాణ్ణి కూడా వదిలేసి వచ్చావు'' అంది రత్తమ్మ.

కూతురు వచ్చిందన్న సంతోషంతో రెండు రోజులు హుషారుగా తిరిగింది. కొత్త గుడ్డలు తొడిగింది. పిండి వంటలు చేసింది. పిల్లల్ని ఎత్తుకు తిరిగింది రత్తమ్మ. కానీ సీతకి మనస్తిమితం లేదు. కూర్చున్న చోటే ఉండి పోతూంది. పనిలో కల్పించుకోలేక పోతూంది.

'ఈ పాట్లెందుకమ్మా?... నిన్ను తీసుకు వెళ్ళడానికే వచ్చా మావ వద్దకు. నడు. నెత్తిమీద పెట్టుకుంటాడు. వాణ్ణి విడిచి నేనుండలేను. నన్ను విడిచి నీకు మతి లేదు. ఎందుకొచ్చిన బాధ... పద పాలెం పోదాం' అని మనస్సులో మాట తల్లికి చెప్పలేకపోతూంది.

మతి లేక పడుకున్న సీత దగ్గిరికి విసురుగా వచ్చింది రత్తమ్మ.

''పడుంటే నీకూ, నీ పిల్లలకీ తిండి ఎట్టా దొరుకుతుందే! అంత మొగుడిమీదే మనసున్నదానివి ఎందుకొచ్చినట్టు! అక్కడే ఉండక పోయావా. నా మీదెందుకు ఈ బరువు?'' అంది సీతని కుదిపి. లేచి కూర్చుంది సీత.

''ఈ పాడు బతుకును నేను బతకలేనమ్మా. నేను చచ్చిపోతాను. ఈ పిల్లల్ని నువ్వు పెంచుకో. నేను పని చెయ్యలేను. మావకి దూరంగా బతకలేను. మావకేం... వాడు మగ రాజా. సావిత్రిని చేసుకుంటాడు. నేనే దిక్కు మాలిందాన్ని'' అంది.

నిటారుగా నిలబడింది రత్తమ్మ.

''ఏమన్నావ్...వాడు సావిత్రిని చేసుకుంటాడా! ఎట్టా చేసుకుంటాడో నేను చూస్తాను. పొలం గట్ల మీద మీ నాన్నతో విరోధం తెచ్చుకున్న ఆ సుబ్బన్న కూతురా... దాన్ని పెళ్ళాడతాడా! వాడు నా తమ్ముడా! నేను బతికుండగా అంత పని చేస్తాడా! పద పాలెం పోదాం'' అంది.

ఒక వారంలో హోటలు అమ్మేసింది రత్తమ్మ. సీతని, పిల్లల్ని తీసుకుని రైలు ఎక్కింది. పాలెంలో ఇల్లు జేరే సరికి సందె వేళ అయింది.

వీధిలో ఇంటి ముందు మంచం మీద రాజా సుబ్బన్నతో మాట్లాడుతున్నాడు. సీత కన్నీళ్ళతో ఇంట్లోకి నడిచింది. రత్తమ్మ నడుంమీద చేయి వేసుకుని వీధిలో నిలబడిపోయింది.

''ఇదేం అన్యాయం సుబ్బన్నా. నా కూతురు బతికుండగానే ఈ రాజాగాడికి నీ కూతుర్ని ఇస్తావా?''

''అది నాకేటి తెలుస్తది? మీరు పట్నపోళ్ళు. ఈ ఊళ్లో ఉండలేక నీ కూతురు నెల తిరగకుండా రైలెక్కింది. రాజా ఊరికి దీపం లాంటివాడు. వాడి ఇంటనే వెలుగు లేక చిన్నపోవటం ఎవరూ చూడలేరు. నీ కూతురు వాణ్ణి వదిలేసిందంటే నాపిల్ల నిద్దామనుకున్నా. తప్పేటుంది?'' అన్నాడు సుబ్బన్న.

''మళ్ళీ ఈ యవ్వారం తేబోక'' అని లోపలికి నడిచింది. రత్తమ్మ.

''ఓయ్ సీతాయ్, గడుసు పిల్లవేనే. మీ అమ్మని తెచ్చేశావు ఏకంగా. నయాన భయాన నేను చెయ్యలేక పోయాను'' అన్నాడు రాజా సీతని దగ్గిరగా లాక్కుని.

''ఫో, సిగ్గుమాలినోడా!'' అంది సీత, గాలికి దీపం ఆరిపోకుండా కాపాడటానికి చేతులడ్డుపెట్టినట్లు చుట్టూ చేతులు చుట్టి.

* * * *